## "నేను - నాగార్జున -ఫాన్స్" (ఒంగోలు కథలు -9) - by పార్థు

Back Home

ఈ పేజీని పంపండి

మొన్నీ మధ్య ఒక యువ హీరో కి సంబంధించిన వెబ్ సైట్ లో, ఆ హీరో నటించిన లేటెస్ట్ చిత్రం తాలూకు లైవ్ రిపోర్ట్స్ చూస్తున్నప్పుడు ఆ హీరో ఫాన్స్ వారు ఆ వెబ్ సైట్ వార్షికోత్సవం సందర్భం గా జరిపిన వేడుకలు, దిగిన ఫోటో లూ, చేసిన హడావిడి చూసి నేను నాగార్జున అభిమాని గా వున్నప్పటి రోజులు గుర్తొచ్చి ఇది రాయాలనిపించింది.

అప్పట్లో, నేను, నాతో పాటు బోసు, సారధి, సతీష్, శ్రీ రామ్, రవీంద్ర, "దూద్ పేడా" శీనుగాడు నాగార్జున ఫాన్స్. ఇందులో బోస్ గారిది, సారధిదీ ప్రత్యేక పాత్రలు! వాళ్ళు "registered" ఫాన్స్.

కాస్త విపులం గా చెపుతాను.

ఒంగోలు కి దగ్గరగా వున్న ఒక ఊరిలో స్థాపించబడిన నాగార్జున అభిమాన సంఘం లో వాళ్ళది శాశ్వత సభ్యత్వం, వాజ్ పేయి దీ, అద్వానీ దీ BJP లో లా! సారధి గాడు బాగా డబ్బున్న యువ వ్యాపారవేత్త. ఒక్క బోసు గారిని మినహాయిస్తే, మిగిలిన వారెవ్వరికీ అక్కినేని వారి మీద అసలు ఎలాంటి అనురాగం లేదు, కేవలం నాగార్జున మీద అభిమానం తప్ప. ఈయన "ప్రేమనగర్" చూసి వీర ఫాన్ అయ్యా అని చెపుతుంటారు. సరే, విషయానికి వస్తే, ఆ ఏడు, పార్టీ ఎన్నికలలో బోసు గారిని "జెనరల్ సెక్రెటరీ & కరెస్పాన్ డెంట్" గా ఎన్నుకోవటం జరిగింది ఏకగ్రీవం గా! ఆయనకి "అక్కినేని" వంశం మీద, "అన్నపూర్ణా" సంస్థ మీదా వున్న అపారమైన అవగాహన ఆ పదవి ని తెచ్చిపెట్టాయి. పార్టీ ఫండ్ కి ఢోకా వుండదని సారధి గాడిని ప్రెసిడెంట్ ని చేసేసారు. ఇంకా ఏవేవో పోస్ట్ లు, వాటి కి తగ్గ ప్రతినిధులని ఎన్నుకోవడం అయిపోయింది. నాకేదో కట్టబెట్టాలని ప్రయత్నించారు (అడ్వైజరీ కమిటీ లో సభ్యుడుగా ట), సున్నితం గా తిరస్కరించాల్సి వచ్చింది, ఇంట్లోంచి ఖచ్చితం గా తోయించుకోవడం ఇష్టం లేక!

BJP జెనరల్ సెక్రెటరీ ఏమైనా కూసంత ఖాళీ గా వుండేవాడేమో గానీ, సదరు సెక్రెటరీ బోసుగారు మాత్రం సినిమా రిలీజ్ అవుతుంటే తెగ బిజీ గా వుండేవారు. పార్టీ కార్యాలయం లో కూర్చుని, కట్టల కి కట్టలు కార్డ్ లు రాసి, రాష్ట్ర నలుమూలలా వున్న నాగార్జున అభిమాన సంఘాలకి పోస్ట్ చేసే వాళ్ళు. నాగార్జున కొత్త సినిమా, ఒంగోలు లో, ఏ థియేటర్ లో రిలీజ్ అవుతోంది? ఆ థియేటర్ కెపాసిటీ ఎంత? ఆ థియేటర్ లో ఇంతకు ముందు ప్రదర్శింపబడిన నాగార్జున చిత్రాలు ఎన్ని? (వీలుంటే ANR వి కూడా), అందులో ఎన్ని 2 వారం పోస్టర్ కి కూడా నోచుకోలేదు?, ఎన్ని 50 రోజుల తరువాత తీసేసారు?, ఎన్ని 100 రోజులు ఆడాయి? ఎన్ని రోజులు DCR (Daily Collection Report, ఇది థియేటర్ వాళ్ళు maintain చేస్తారు, దీనిని బట్టే టాక్స్ లెక్కలు చేసే వాళ్ళు) తో ఫుల్ అయ్యాయి? ఎన్ని సినిమాల బెనిఫిట్ షో లకి కలెక్టర్ పర్మిషన్ ఇచ్చాడు? ఈ డేటా మొత్తం శ్రద్ధ గా సేకరించి, కుదురుగా కూర్చుని, గుండ్రంగా రాసేవాడు కార్డ్ ల మీద. డాటా - వేర్ హౌసింగ్ టూల్స్ లో కూడా అంత అనలైజింగ్, అంత రిపోర్టింగ్ కేపబిలిటీస్ వుండి వుండవ్!

ఇక సభ్యులంతా, సాయంత్రం టైమ్ కి సారధి వాళ్ళ షాప్ మీద వున్న చిన్న రూమ్ లో సమావేశం అయ్యేవాళ్ళు. అది ఫాన్స్ కి కార్యాలయం కాదు, ఓ దేవాలయం! అక్కడ నిరంతరం నాగార్జున

భజనలు, ANR స్తోత్రాలూ, అమల అర్చనలూ లాంటివి జరుగుతుండేవి. బోసు, సారధి Pre-release హంగామా కి శ్రీకారం చుట్టేవాళ్ళు. సంస్థ అవలంబించవలసిన మౌలిక సూత్రాలు దగ్గర నుంచి, పెట్టుబడులు వరకూ సుదీర్ఘ చర్చలు జరిగేవి. పైన చెప్పిన ఎడ్వైజరీ కమిటీ ఇచ్చిన సూచనలూ, సలహాల మేరకు చేయాల్సిన పనుల లిస్ట్ తయారుచేసేవాళ్ళు.

దాని ముందు, మన ప్రోజెక్ట్ ప్లాన్స్ కూడా బలాదూర్, అంత పకడ్బందీ గా వుండేవి, రిసోర్స్ ఎలొకేషన్, ఖర్చుల ఎస్టిమేట్లూ, scheduling, రిపోర్టింగ్ మెకానిజం తో సహా! కొన్ని ముఖ్యమైన టాస్క్ ల వివరాలు చూడండి:

1. కరపత్రాల ముద్రణ + మేటర్ తయారీ:

దీనికి ఒక ఉప-కమిటీ. క్లాస్ ని, మాస్ నీ ఆకర్షించే విధంగా వుండాలి కాబట్టి flyers, మేటర్ కోసం, "content management group" ని సంప్రదించే వాళ్ళు. ఈ గ్రూప్ సభ్యులు కొత్త కొత్త బిరుదులు ఇవ్వడం లో నిష్ణాతులు. ఉదాహరణకి లాస్ట్ సినిమా రిలీజ్ అయినప్పుడు "ఆంధ్రా అమితాబ్" అని వాడారు అనుకోండి, ఈ కొత్త సినిమా వచ్చేసరికి నాగార్జున సడెన్ గా South India Suprem, లేక Wing Commander అయిపోయేవాడు. ఇంక , "కోస్తా కింగ్" అనో, "చిత్తూరు చిరుత" అనో ఏవేవో కనిపెట్టేవాళ్ళు. కాబట్టి వీళ్ళు "క్రియేటీవ్" సెక్షన్ కిందకి వచ్చేవాళ్ళు. కనీస అర్హత కింద Intermediate Single Sitting అన్నది సెట్ చేసారు. అలానే, ఇక రికార్డ్ లకి సంబంధించిన మేటర్ వేరే వుంటుంది. ఆ బాష అర్ధం చేసుకుని, నేర్పించడం NIIT, APTECH, Genesis లాంటి వాళ్ళ అయ్యే పని కాదు. సినిమాల లో మునిగి తేలే వాడికి తప్ప, ఇంకెవడికీ ఆ బాష అర్ధం కాదు.

ఉదాహరణ కి, "ఖమ్మం లో, ఒకే సంవత్సరం లో విడుదలై, మినిమమ్ 2 వారాలు, రోజూ 4 ఆటలతో, 6 థియేటర్ లలో ప్రదర్శింపబడి, మెయిన్ థియేటర్ లో 9 రోజులు, 5 సైడ్ థియేటర్ లలో 4 రోజులు DCR తో continous fulls అయిన 3 చిత్రాలు గల ఏకైక హీరో, స్లాబ్ సిస్టం లో, మా "నైజాం నవాబ్" నాగార్జున అని రాసేవాళ్ళు. (అది చదివి, ఇంక నైజాం లో నవాబుల పరిపాలన, రజాకర్ల అల్లర్లు సాగుతున్నాయా అని ఆవేశపడిపోయే అమాయకప్రాణులు కూడా కొన్ని వుంటాయి). అలా వుండేవి ఆ రికార్డ్ లు.

మాస్ ని అలరించడానికి, సరికొత్త పద ప్రయోగాలు కూడా చేసే వాళ్ళు ఈ విభాగం లో. "కోస్తా ఆంధ్రా లో collections వర్షం సృష్టించి, తన సైకిల్ చైన్ పవర్ ఏమిటో చూపించి, ఎడ తెగని వర్షాలను సైతం లెక్క చెయ్యకుండా, వైజాగ్ శరత్-సంగమ్ లో, విడుదలైన మొదటి రోజు ప్రదర్సింపబడిన మొత్తం 12 ఆటలూ House-fulls అయి, 1,72,342.89/- షేర్ వసూలు చేసి, non-A/c డబల్ థియేటర్ కాంప్లెక్స్ లలో, స్టేట్-వైడ్ రికార్డ్ నెలకొల్పి, మిగిలిన హీరోల రికార్డ్ లన్నీ "ఎత్తికొట్టి ఏట్లో వడేసిన" చిత్రం మా "ఫలానా" చిత్రం అంటూ ఏవో రాసేవాళ్ళు. నాకయితే పెదర్ రిపోర్ట్ లా అనిపించేవి.

దీని కింద ఒక గమనిక కూడా ఏడ్చేది.

"దురభిమానులకి హెచ్చరిక!!

మాదీ రికార్డ్, మాదీ రికార్డ్ అని కొందరు అగ్ర హీరోల అభిమానులు సిగ్గు లేకుండా చెప్పుకుంటున్నారు, వారి కిదే మా "పిక్కీ దాదా" చేసే "ఆఖరి పోరాటం"! మీ వాళ్ళ రికార్డ్ ని భూస్థాపితం చేసి, థియేటర్ పునాదులు కదిలించేలా మా "కథానాయకుడు" కండబలం దెబ్బ మరో సారి చూపించాము. మేము రికార్డ్ లు క్రియేట్ చేస్తాము, బద్దలు కొడతాం అంటూ మా రోరింగ్ లయన్ "xxx" ఫాన్స్ తరుపున చేస్తున్న బస్తీ మే సవాల్ ఇదే. "Any center, any day, any show.. ఇదే మా రాయల్ చాలెంజ్" అంటూ గమ్మత్తు గా సాగిపోయేవి.

మేటర్ ప్రిపరేషన్ అయిన తరువాత, ఒక సర్వసభ్య సమావేశం జరిగి, అందరికీ వినిపించి, 3 ఇంట 2 వంతుల మెజారిటీ గెలుచుకున్న తర్వాత, ప్రింటింగ్ పనులపై దృష్టి సారించేవాళ్ళు.

2. ప్రింటింగ్:

ఇక ప్రింటింగ్, మన "ప్రోజెక్ట్ ప్రొపోజల్స్" ఫేస్ లాంటిదే. "Prefered Vendors" వుండేవాళ్ళు, కేవలం వాళ్ళకే ఇచ్చే వాళ్ళు. ఎందుకంటే మిగిలిన ప్రెస్ లలో వేరే హీరో అభిమానులు కొట్టిస్తుండేవాళ్ళు, కాబట్టి మేటర్ లీక్ అయ్యే అవకాశం వుంది అని. ఒకళ్ళ కన్నా, ఎక్కువ మంది Preferred vendors వుండటం వెనుక కూడా బలమైన కారణం వుంది. అదే మన "BCP- Businee Contingency Plan". పెళ్ళిళ్ళ సీజన్ లోనో, ఎలెక్షన్స్ సీజన్ లోనో, తెగ బిజీ గా వుండేవాళ్ళు preferred vendors. కనుక ముందు జాగర్త కోసం. అలానే నిధులు బాగా వున్నప్పుడు, లేదా మేటర్ అదిరింది అనుకున్నప్పుడు, లేదా సినిమా పై విపరీతమైన expectations వున్నప్పుడు (అంతం, శాంతి-క్రాంతి) high-quality పేపర్, కలర్ ప్రింటింగ్ కోసం జిల్లా హెడ్ క్వార్టర్స్ కి పరిగెత్తేవాళ్ళు, No.1 vendor కోసం.

3. Transporation / Advance Booking:

ముఖ్యమైన ఈ కార్యక్రమాన్ని మరో గ్రూప్ నిర్వహించేది. ఎంత మంది సభ్యులు రిలీజ్ రోజు చూడటానికి వస్తున్నారో ట్రాక్ డవున్ చెయ్యటం, వారి దగ్గర అడ్వాన్స్ తీసుకోవడం. జీప్ లేదా మెటడోర్ వాన్ మాట్లడటం (అప్పట్లో, కేవలం ఒంగోలు, చీరాల లోనే వుండేది రిలీజ్) head count ని బట్టి. జీప్ కి ముందు తగిలించడానికి బేనర్స్, ఆరటి లేదా కొబ్బరి చెట్లు సేకరించడం Loud Speakers + నాగార్జున / ANR కేసెట్లు తెచ్చి పెట్టడం జీప్ లో (ఒంగోలు చేరే వరకూ కాలక్షేపం వుండాలి కదా!)

ఇక, official headcount వచ్చిన తరువాత, మన సెక్రటరీ గారు ఒంగోలు, District wide fans association కి లెటర్ రాయడమో లేదా టెలిగ్రామ్ ఇచ్చే వాళ్ళు ఇన్ని టికెట్స్ రిజర్వ్ చేయ్యండి అని.

బయలుదేరే రోజు సభ్యులంతా ఎక్కడ కలవాలి, ఎన్నింటికి కలవాలి అనే schedules, tickets confirm అయిన న్యూస్ రాగానే డిసైడ్ అయిపోయేది.

4. On the big day: (అదే నండీ, మన ప్రోజెక్ట్ ల go-live డేట్ లా!)

షో ఇంక 3,4 గంటలు వుంది అనగా (లిటరల్ గా చెప్పాలంటే తెల్లవారుఝామున 4:30 - 5.00

మధ్యలో), NSS కార్యకర్తలంతా (నాగార్జున శివ సేన అని ముద్దు గా పిలుచుకునేవాళ్ళం) గుమిగూడి, జీప్ ముందు కొబ్బరికాయ కొట్టేవాళ్ళు. బెనిఫిట్ షో కి వెళ్ళలేని సభ్యులు, వెళ్తున్నవారిని కౌగలించుకుని ముందస్తు శుభాకాంక్షలు తెలియజేస్తూ సాదరం గా వీడ్కోలు పలికేవాళ్ళు, మనోళ్ళేదో దేశాన్ని రక్షించడానికి వెడుతున్న రక్షక భటులైనట్టు. ఇక, జిల్లా కేంద్రం లో థియేటర్ దగ్గర అన్ని ఏర్పాట్లనీ క్షుణ్ణం గా పరిశీలించడానికి సారధి గాడు, బోసు గారు ముందు రోజు రాత్రే వెళ్ళిపోయేవాళ్ళు, గాంగ్ వచ్చేసరికి టికెట్స్ తో సహా థియేటర్ దగ్గర రిసీవ్ చేసుకోడానికి.

ఇక అసలు రచ్చ అక్కడ మొదలయ్యేది. అన్ని గ్రామ, మండల, తాలూకా అభిమాన సంఘాల వాళ్ళూ ఒకరినొకరు పరిచయాలు చేసుకోవడం, రంగులు కొట్టుకోవడం, తలకు రిబ్బన్ లు, కొంత మంది పీర ఫాన్ లు, గళ్ళ లుంగీలతో, నోట్లో బీడీలతో, అలా ఇప్పటి తెలుగు సినిమాల్లో "కుర్ర హీరో" ల తీరున వుండే వాళ్ళు. మరికొంత మంది "ఫాన్స్", విశ్వనాథ్ సినిమా లో హీరో లా, బుద్ధిగా దూరం నుంచే చూసి ఆనందిస్తుండే వాళ్ళు (so called డిగ్నిటీ అడ్డొచ్చో, ఇంట్లో తెలిస్తే తంతారని భయం వేసో). వీళ్ళు A class ఫాన్స్ ట. బాక్స్ వచ్చింది అనగానే "crackers" కాల్చటం మొదలయ్యేది. ఆ హడావిడి చూడటానికి రెండు కళ్ళు చాలవ్! నాకు నయాగరా చూసినప్పుడు కూడా అంత ఆనందం కలగలేదు.

6. కొన్ని సంఘటనలు: (ఫాన్స్-ఎసోసియేషన్స్-బెనిఫిట్ షోస్ పరంగా కొన్ని ఆనందకరమైన, ఇబ్బందికరమైన అనుభవాలు ఇవి.)

1. "వారసుడి" తో ఇబ్బంది:

సినిమా వచ్చింది, హిట్ అనిపించుకుంది. ఎటొచ్చీ ఒంగోలు సెంటర్ లో 80 రోజుల తరువాత రన్ కి కొంచెం ఇబ్బంది అయుంది. ఏం జరిగిందో తెలియదు గానీ, మా బోసు కీ, సారధి గాడికీ మెసేజ్ వచ్చింది. ఫలానా తారీఖు టాప్ హెడ్స్ వస్తున్నారు head quarters నుండి పరిస్థితి సమీక్షించడానికి, మీ వూరు ఫలానా తారీఖు అని. ఏర్పాట్లు జరిగిపోయాయి, నేతలు దిగారు విడిది లో, కాఫీ, ఫలహారాలు అయ్యాక వచ్చిన పని సెలవిచ్చారు. మీ సంస్థ నుండి, మీ శక్తి మేరకు విరాళం ఇవ్వాలి, పని వుంది కాబట్టి అన్నారు. ఇక లోకల్ లీడర్స్ విజృంభించారు మీటింగ్ లో. మర్నాడు నోట్ బుక్ పట్టుకుని, తెలిసిన వాళ్ళ అందరిదగ్గరకూ చందాలకి బయలుదేరారు. నేను ఎంత unofficial member ని అయినా పార్టీ లో, బోసు, సారధి, నాదీ విడదీయరాని స్నేహం అవటం చేత, నువ్వు వుండాల్సిందే ఈవెంట్ లో అన్నారు. నేను, MCA ఫస్ట్ ఇయర్ పరీక్షల తయారీ కోసం ఇంటికి వచ్చివున్నా. నా వల్ల కాదురా ఈ తిరుగుడు, నీకు తెలుసు కదా ఇంట్లో సంగతి అంటే వినిపించుకోలా.. లాక్కెళ్ళారు. ఎక్కిన గుమ్మం ఎక్కినట్టే, దిగిన గుమ్మం దిగినట్టే అన్నట్టు అయ్యింది పరిస్థితి. విచిత్రమేమిటంటే, చందా ఇచ్చే ఒక్కడు కూడా, అసలు ఇలాంటి పనికిమాలిన వాటికి మేమెందుకివ్వాలి? అనకపోవడం. అదే ఇండియా అంటే మరి! సారాధిగాడి పలుకుబడి మరి. చాలా ఇబ్బంది పడి, నసపెట్టి, ఎలానో మధ్యలోంచి తప్పుకున్నా, కానీ, 100th డే సెకండ్ షో మాత్రం బాగా ఎంజాయ్ చేసా.

2. "శాంతి - క్రాంతి" శబ్దాలు

రవిచంద్రన్ నిర్మించిన "ప్రేమలోకం" అనే డబ్బింగ్ సినిమా బాగా హిట్ అయి అతని మీద expectations పెంచింది. అదీగాక, ఈ సినిమా కోట్ల రూపాయలతో, భారీ తారాగణం తో రకరకాల భాషల్లో రకరకాలుగా తీస్తుండటం ఇంకా హైప్ చేసాయి. అదే హైపూ, హంగామా flyers లో వుండాలి అని తీర్మానించారు. అప్పుడు నాగార్జున వరుస ఫ్లాప్ లో మునిగిపోయి వున్నాడు. దానిని దృష్టి లో పెట్టుకుని రాసిన flyer, ఒక సంచలనం అయింది. మొత్తం గుర్తులేదు గానీ..కొంత part ఇలా వుంటుంది.

"ఇది పెను తుఫాను ముందు వుండే నిశబ్ద వాతావరణం. ఈ స్థబ్దత పది భూకంపాలకి సూచిక ఉప్పొంగే వరకూ లావా ఉబకదు, ఎగసి పడేవరకూ కెరటం ఆగదు, బాక్సాఫీస్ ప్రకృతి ని ప్రళయ తాండవం చేయించడానికి , తాండవమాడే "శివు" నిలా, మూడో కన్ను తెరిచిన "రుద్రుని" లా, "అగ్ని పుత్రుని" లా, మసకబారిన అభిమనుల కన్నుల్లో "కాంతి" రేఖలు కురిపించడానికి, దురభిమానుల దౌర్జన్యాన్ని నిలువరించే "శాంతి" కపోతమై, బూజుపట్టిన రికార్డ్ ల కు చరమ గీతం పాడటానికి ముందుకొస్తున్న మా "శాంతి-క్రాంతి" కి ఇదే మా ఆహ్వానం"

10 రోజులో, 12 రోజులో ఆడినట్టు గుర్తు ఈ సినిమా ఒంగోలు లో!

3 "ప్రెసిడెంట్ గారి పెళ్ళాం" మిగిల్చిన విషాదం:

థియేటర్ ముందు కట్టే బేనర్ ల మీద ప్రెసిడెంట్ ఫలానా వాడని, జాయింట్ సెక్రెటరీ ఫలానా వాడని రాస్తుంటారు. అలా చూసుకోవాలని మా సారధిగాడికి మహా కోరిక ఎందుకంటే వాడే కదా ఆ ఏడు ప్రెసిడెంట్. వాడి ఆధ్వర్యం లో సంస్థ విభిన్న ప్రయోగాలు చేసింది అని అనిపించుకోవాలన్న కోరిక కూడా. బేనర్ కి వుండే రెగ్యులర్ ఫార్మెట్ వాడికి నచ్చలా . వెంటనే, ప్రెసిడెంట్ సారధి అనే పేరు కి ఫాంట్ సైజ్, కలర్, పొజిషన్ అన్నీ మార్చేసుకున్నాడు. ఇప్పుడు వాడి పేరు అందరికన్నా పైన, చాలా పెద్దగా, స్పష్టం గా కనిపించసాగాయి. మిగిలిన వాళ్ళు లోపల ఏమి అనుకున్నా, పైకి "ఆహో, ఓహో" అన్నారు. ప్రెసిడెంట్ గారి పెళ్ళాం (PGP) రిలీజ్ అయి, హిట్ టాక్ తో ఒ నెల రోజులు పూర్తి చేసుకుంది అప్పటికి. అది ఆడే థియేటర్ దగ్గరకి సాయంత్రం టైమ్ లో వెళ్ళే వాళ్ళం. థియేటర్ కి పక్కన చిన్న బ్రిడ్జ్ వుండేది, అటు పక్కగా దానికి అనుకుని బలహీన వర్గాల వారి ఇళ్ళు వుండేవి (క్షమించాలి అలా రాయక తప్పనందుకు!). అంటే థియేటర్ లో పని చేసే డైలీ లేబర్ వాళ్ళ ఇళ్ళు (పోస్టర్స్ అంటించే వాళ్ళు, advertisement బండి లాగే వాళ్ళు) మామూలు గానే ఆ రోజు సాయంత్రం కూడా వాడు, నేను, బోసు, సతీష్ వెళ్ళాం. థియేటర్ apperance లో ఏదో తేడా కనిపించింది, పెద్ద పట్టించుకోలా. కాఫీలు తెచ్చుకుని తాగుతూ ఓ బెంచ్ మీద కూర్చుని బోసు కి వేరే వూళ్ళ నుండి సినిమా రన్నింగ్ మీద వచ్చిన రిపోర్ట్స్ చూస్తున్నాం. దూరం గా ఆ ఇళ్ళల్లో చిన్న పిల్లలు ఆడుకుంటున్నారు. మళ్ళీ కబుర్లలో పడ్డాం. ఎందుకో వాళ్ళు వేసుకున్న డ్రెస్ లు వింత గా కనిపించాయి. పరీక్షించి చూసేసరికి, మా అనుమానం నిజం అయ్యింది. ఒక కుర్రాడి లాగూ వెనుక వైపున "ప్రెసిడెంట్ : సారధి" అని మా వాడు ఇష్టపడి చేయించుకున్న ఫాంట్ కలర్ తో దేదీప్యమానంగా వెలిగిపోతోంది. అలానే మిగిలిన వాళ్ళ కాళ్ళ మీద, వొంటి మీదా మిగతా సభ్యులు వేలాడుతున్నారు. తిరిగి వెళ్ళేప్పుడు బాగా అర్ధమయ్యింది "థియేటర్ apperance" లో మార్పు ఎందుకొచ్చిందో. బేన్నర్లు చాలా వరకూ పీకేసారు నెల రోజులు పైన అయిపోయింది రిలీజ్ అయి అని, థియేటర్ వాళ్ళు.

భారతదేశం లో పేదరికం ఎంత ఘోరం గా వుంటుందో తెలుసు, మరోసారి చూసిన క్షణం అది! పిల్లలకి వంటి మీద బట్టలు కోసం థియేటర్ ల దగ్గర బేనర్ ల మీదే ఆధారపడ్డ కుటుంబాలు కూడా వుంటాయి అని తెలిసిన చేదు అనుభవం అది. "రుద్రవీణ" సినిమా లో చిరంజీవి వచ్చినప్పుడు వంటి మీద బట్టలు లేక, తల్లి-కూతుళ్ళ లో, ఎవరో ఒకరే బయటకు వచ్చి మాట్లాడే సన్నివేశం చూసినప్పుడల్లా నాకు ఇదే సీన్ గుర్తొచ్చి మెలిపెడుతుంది. అది ఒక క్షణం.. మళ్ళీ మామూలే! నేను మధ్య తరగతి మనిషిని.

4. "ఖల్ నాయక్" కమామీషు

"ఖల్ నాయక్" సినిమా తెలుగు లో తీస్తున్నారు, ఓ ప్రముఖ హీరో చేయబోతున్నారు అని పేపర్ లో వచ్చిన వార్త ను పట్టుకుని వీళ్ళు చేసిన హడావిడి అంతా, ఇంతా కాదు. అంత పొడ్డు, అంత పొడుగు, అంత hairstyle, అంత సినీ స్టయిల్ వున్న హీరో "భయ్యా" (నాగార్జున) కాక ఇంకెవరు అని రెచ్చిపోయి సంబరాలు చేసుకున్నారు. ఓ వారం తరువాత వినోద్ కుమార్ కి పిగ్గ పెట్టి తోసేసరికి నోట మాట రాలా ఒకొక్కడికీ. ఇది అన్యాయం, అమానుషం, ఘోరం అంటూ RTC బస్ లు తగలపెట్టినంత పని చేసారు. సారధి గాడి ఆధ్వర్యం లో NSS కార్యకర్తలు.

5. "నిన్నే పెళ్ళాడుతా"

హైదరాబాద్ లో వుంటున్న నా దగ్గరకి వచ్చారు బోసు, సారధి ఒక సారి. అప్పటికి సినిమా రిలీజ్ అయి 3,4 రోజులు అయింది. నేను ఇంకా చూడలేదు, వాళ్ళు అప్పటికే చూసేసారు. సరే "దేవి 70mm" కి వెళ్ళాం. టికెట్స్ దొరికే అవకాశం లేదు. ఇక, అప్పుడు బయట పడింది "Registered Fans" గొప్పతనం.

చెప్పాను కదా బోసు స్టేట్ వైడ్ associations అందరికీ లెటర్స్ రాసేవాడని. తన దగ్గర ఎప్పుడూ ఆ స్టాంప్, లెటర్ హెడ్ వుండేవి. లక్కీ గా, P.రవీందర్ రెడ్డి అని అప్పట్లో నాగార్జున ఫాన్స్ కి స్టేట్ వైడ్ ప్రెసిడెంట్ దేవి ఎదురుగుండా వున్న "అదేదో" గేట్ ఇరానీ చాయ్ సెంటర్ లో వున్నాడని తెలిసింది. ఇక, ఈయన వెళ్ళడం, అప్పటికే ఉత్తరాల ద్వారా, ఫోన్ ల ద్వారా తెలిసుండటం తో, రవీందర్ మమ్మల్ని, లోపలకి తీసుకెళ్ళి టికెట్స్ ఇప్పించారు. నిజం చెప్పొద్దూ నాకు భలే థ్రిల్లింగ్ గా అనిపించింది. రవీందర్ కి మేనేజర్ రూమ్ లో ఇచ్చిన గౌరవం చూసి! ఆ తరువాత బోసు గారు చెప్పగా తెలిసింది, నాగార్జున తో చాలా క్లోజ్ గా వుంటాడట. "వారసుడు" సినిమా కి క్లాప్ ఇతని చేతే కొట్టించారని. చా! ఎందుకీ Software బతుకులు అనుకున్నాను పొద్దున్నే టీమ్ లీడ్ నేను రాసిన కోడ్ చూసి ఇచ్చిన వార్నింగ్ గుర్తుకొచ్చి!

కొసమెరుపు:

* ఇలాంటి episodes బానే గడిచాయి కొంతకాలం. తరువాత్తరువాత అనేక మార్పులు వచ్చాయి. అన్ని చోట్లా లానే అక్కడ సభ్యుల లో విభేధాలు మొదలై, చివరికి సారధి, బోసులని బయటకు తోసేసారు. కాలక్రమేణా, వారి ఆలోచన ధోరణి లో మార్పు కలిగి జీవన స్థిరత్వం మీద దృష్టి సారించారు. పెద్దలు ఇచ్చిన ఆస్థులని మరింతలు చేసే దిసగా సారధి కొత్త వ్యాపారాలు ఏవో పెట్టాడు, బిజీ అయ్యాడు. తన B.Sc పట్టా తో, 4 చోట్లా ట్యూషన్స్ చెపుతూ, చిన్నగా లెక్చరర్

స్థాయికి ఎదిగారు బోసు.

* వాడు ముచ్చటపడి చేయించుకున్న ఫాన్స్ association letter head ని (పేజీ సెంటర్ లో సైకిల్ చైన్ తో శివ అన్న ఎర్ర అక్షరాలతో), ఇప్పుడు వాళ్ళ సారథి వాళ్ళ అమ్మాయి A,B,C,D లు రాసుకోడానికి, వానొస్తే పడవలు చేసివ్వడానికీ వాడుతున్నాడట! బోసు చెపుతారు నవ్వుతూ. అలానే, సెంట్రల్ గవర్నమెంట్ ఏదైనా రివార్డ్స్ లేక అవార్డ్స్ ఇవ్వాలి మాలాంటి వాళ్ళకి అన్నన్ని వందల, వేల కార్డ్ లు, inland లెటర్స్ కొని సేల్స్ పెంచినందుకు అని కూడా అంటారు నవ్వుతూ.

* పెళ్ళి చేసుకునేప్పుడు నాగార్జున భయ్యా సినిమా లా ట్రెండ్ సెట్టర్ లా వుండాలి పెళ్ళి కార్డు అనేవారు బోసు గారు. వధువు / వరుడు అనే రొటీన్ పేర్లు వుండకూడదు అని, వధువు అనే చోట "గీతాంజలి", వరుడు అనే చోట "శివ" అని హెడింగ్ పెట్టించి మా పేర్లు వేసుకుంటాను అంటుండేవారు సరదాగా, సీరియస్ గా. వ్యక్తిగత కారణాల వల్ల, కుటుంబ పరిస్థితుల రూపం లో, 40 కి చేరువ అవుతూ వున్నా ఆ ముచ్చట తీర్చుకోలేకపోయిన ఆయన్ను చూస్తే అదో రకం బాధ.

దారులు వేరయ్యాయి, ఎవరి జీవితం తో వాళ్ళు పరుగులు పెడుతున్నారు.

* కానీ వాళ్ళు నాగార్జున ని అభిమానించడం విషయం లో మార్పు రాలేదు. నాలాగ పూసరపెల్లులు కాలేకపోయారు, పార్టీ మార్చలేకపోయారు. ఎటొచ్చీ ఫాన్స్, associations, benefit show లూ లాంటి వ్యాపకాలు పోయాయి అంతే! ఇప్పటికీ అదే తన్మయత్వం, అదే మమకారం నాగార్జున అంటే.

* "రామదాసు" చూసిన వెంటనే సారథిగాడు ఫోన్ చేసి "ఎప్పటికైనా రియల్ ట్రెండ్ సెట్టర్ అంటే మా నాగార్జునేరా" అన్నాడు. "మా" అనే పదాన్ని వత్తి పలుకుతూ, నన్ను వుడికించాలని, మెగాస్టార్ ని వెనకేసుకొస్తున్నందుకు పగ తీర్చుకోవాలని! అదో సంతృప్తి వాడికి. అవును మరి ఎలా మర్చిపోతాడు నేను చిరంజీవిని దారుణం గా విమర్శించిన రోజులు?

మరి బోసుగారు ఎలాంటి ఆనందం లో వున్నారో "రామదాసు" విజయాన్ని ఆస్వాదిస్తూ తెలియదు. వీలు చూసుకుని మాట్లాడాలి. ఎంతైనా ఒకప్పుడు నాగార్జున ఫాన్ నే కదా.

*** End ***

---

మీ సూచనలూ, సలహాలు రచయిత పార్థు కి తెలియచేయండి.
మీ అభిప్రాయాలు రచ్చబండ లో తెలియచేయండి